# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేదీ: 04-11-2017**

స్థానిక సంస్థలు అత్యంత క్రియాశీలకంగా పనిచేసే విధంగా, విధి నిర్వహణలో విఫలమైన వారిపై చర్యలు తీసుకోవడానికి అవకాశం కల్పించే విధంగా కొత్త పంచాయతీ రాజ్ చట్టం రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు సూచించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థపై అవగాహన, అనుభవం కలిగిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంస్థల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకుని కొత్త చట్టానికి రూప కల్పన చేయాలని సీఎం కోరారు. వీలైతే ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే కొత్త చట్టం బిల్లును ప్రవేశపెట్టి, చట్టం తేవాలనేది ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి ప్రకటించారు. కొత్త పంచాయతీ రాజ్ చట్టం రూపకల్పనపై ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ప్రగతి భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు శ్రీ జూపల్లి కృష్ణారావు, శ్రీ జోగు రామన్న, ప్రభుత్వ ముఖ్య సలహాదారు శ్రీ రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.పి. సింగ్, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ శ్రీ నిరంజన్ రెడ్డి, ఎంపీ శ్రీ బూర నర్సయ్య, ఎమ్మెల్యేలు శ్రీ సుధీర్ రెడ్డి, శ్రీ బాజిరెడ్డి గోవర్ధన్, శ్రీమతి కోవ లక్ష్మి, శ్రీ రవీందర్ నాయక్, కార్పొరేషన్ల చైర్మన్లు శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి, శ్రీ వి. ప్రకాశ్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శ్రీ ఎస్. నర్సింగ్ రావు, శ్రీ రామకృష్ణారావు, శ్రీ సునీల్ శర్మ, కార్యదర్శి శ్రీమతి స్మితా సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీ విజయానంద్, తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్ శ్రీ జి. జయపాల్ రెడ్డి, కన్సల్టెంట్లు శ్రీ శంకరయ్య, శ్రీ లింబగిరి స్వామి, ఎన్జీవో ప్రతినిధులు శ్రీ ఏపీ రంగారావు, శ్రీ బాలాజీ ఊట్ల తదితరులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ఎలా ఉండాలి? ఎలాంటి విధులు స్థానిక సంస్థలకు అప్పగించాలి? ఎలాంటి బాధ్యతలు వారు నిర్వర్తించాలి? వాటికి నిధులు ఎలా సమకూర్చాలి? ప్రజలకు మరింత జవాబుదారీగా, మరింత క్రియాశీలకంగా తమ కార్యకలాపాలు నిర్వహించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశాలపై సమావేశంలో పాల్గొన్న వారితో కూలంకషంగా చర్చించారు. అందరి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

“కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో గొప్ప పరిపాలనా సంస్కరణలు తెచ్చుకున్నాం. కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసుకున్నాం. త్వరలోనే కొత్త గ్రామ పంచాయతీలు కూడా ఏర్పాటు చేసుకోబోతున్నాం. అప్పుడు తెలంగాణలో గ్రామ పంచాయతీల సంఖ్య 12-13 వేలు దాటుతుంది. ఈ గ్రామ పంచాయతీలు కేవలం నామమాత్రంగా ఉండడానికి వీలు లేదు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు విధులు, బాధ్యతలు లేకుండా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. అవన్నీ ప్రజలకు నూటికి నూరు శాతం చేరాలంటే స్థానిక సంస్థలు బాగా పనిచేయాలి. ఏ గ్రామానికి ఆ గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయతీ చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరతాయి. ఇప్పుడున్న విధానం కొనసాగితే ప్రయోజనం లేదు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలు భయంకరమైన ప్రమాదంలో ఉన్నాయి. ఒకప్పుడు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఏజన్సీలుగా ఉన్న పంచాయతీలు, స్థానిక సంస్థలు రానురాను రాజకీయపరమైపోయాయి. ఈ పరిస్థితిలో సమూలంగా మార్పు రావాలి. గ్రామ పంచాయతీలను మరింత శక్తివంతం చేయాలి. మరింత ప్రభావవంతం చేయాలి. ప్రతి కార్యక్రమంలో గ్రామ పంచాయతీలను భాగం చేయాలి. ఏ గ్రామానికి ఆ గ్రామం మారితేనే యావత్ తెలంగాణ మనం కలలు కంటున్నట్లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. కాబట్టి గ్రామ పంచాయతీలు ఎలాంటి విధులు నిర్వర్తించాలి? వారికున్న బాధ్యతలు ఏమిటి? అనే విషయంలో పూర్తి స్థాయి స్పష్టతనిస్తూ కొత్త చట్టం తయారుకావాలి. సర్పంచుల మాదిరిగానే ఎంపిటిసి, జడ్పిటిసి సభ్యులకు కూడా విధులు, బాధ్యతలపై స్పష్టత రావాలి” అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

“కేవలం విధులు, బాధ్యతలు అప్పగించి చేతులు దులిపేసుకుంటే గ్రామ పంచాయతీలు ఏ పనీ చేయలేవు. వాటికి కావాల్సిన నిధులు కూడా అందించాలి. వచ్చే బడ్జెట్లో నేరుగా గ్రామ పంచాయతీలకు జనాభా ఆధారంగా నిధులు కేటాయిస్తాం. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు నిధులు సమకూరుస్తాం. కేంద్ర నిధులు, కార్పొరేట్ రెస్పాన్సిబులిటీ కింద లభ్యమయ్యే డబ్బులు, ఫైనాన్స్ కమిషన్ ద్వారా వచ్చే నిధులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) ద్వారా సమకూరే డబ్బులు అన్నీ జమచేసి గ్రామ పంచాయతీకి అప్పగించాలి. గ్రామస్తుల్లో కూడా శ్రమదానం ద్వారా పనులు చేసుకునే ధోరణిని అలవాటు చేయాలి. గ్రామ పంచాయతీకి విధులు, బాధ్యతలతో పాటు కావాల్సిన నిధులు, ప్రజల భాగస్వామ్యం, నిరంతర పర్యవేక్షణ ఉంటే సమర్థంగా పనిచేయగలవు. ఇన్ని విధాల సహకారం అందించినా సరే, విధుల నిర్వహణలో వైఫల్యం చెందిన చోట క్రమశిక్షణ చర్యలు తీసుకునే వెసులుబాటు ప్రభుత్వానికి ఉండాలి. వీటన్నింటికీ అవకాశం కల్పించే విధంగా కొత్త పంచాయతీ రాజ్ చట్టం తయారు కావాలి” అని ముఖ్యమంత్రి చెప్పారు.

"వచ్చే ఏడాది నిర్ణీత కాల పరిమితి ప్రకారం పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు పూర్తికాగానే సర్పంచులకు పూర్తి స్థాయిలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేయాలి. విధులు, అధికారాలు, బాధ్యతలు, నిధులపై స్పష్టత ఇవ్వాలి. ఎవరి గ్రామ అభివృద్ధి ప్రణాళికను వారే తయారు చేసుకునేలా తర్ఫీదునివ్వాలి. ఆ గ్రామానికున్న అవసరం ఏమిటి? భవిష్యత్తులో వారికి ఇంకా ఏది అవసరమవుతుంది? తదితర విషయాలను బేరీజు వేసుకుని అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలి. దానికి అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. ఈ దృక్పథంతో సర్పంచులు పనిచేసేలా వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. సర్పంచులుగా ఎన్నికైన వారిలో చాలామందికి సహజంగా మంచిపేరు తెచ్చుకోవాలనే తపన ఉంటుంది. అందుకే వారు మంచిపనులు చేసే అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వ విధానం ఉండాలి. ఎవరో ఏదో అంటారని కాకుండా, ఎవరికి వారు స్వీయ క్రమశిక్షణతో ప్రజలతో అనుసంధానమై పనిచేస్తే అద్భుత ఫలితాలు వస్తాయి" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు సంబంధించి ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు కోరుతూ లేఖలు రాయాలని ఉన్నతాధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. గిరిజన తండాలు, గోండు, కోయ గూడేలు, చెంచు పల్లెలతో పాటు ప్రధాన గ్రామానికి వెలుపల ఉన్న పల్లెలు, గూడేల వివరాలు సేకరించాలని కోరారు. 500 మందికి పైగా జనాభా ఉన్న ఆవాస ప్రాంతాలను గ్రామ పంచాయతీలుగా మార్చాలనే నిర్ణయం తీసుకున్నందున, దానికనుగుణంగా ప్రతిపాదనలు సమర్పించాల్సిందిగా ఎమ్మెల్యేలను కోరాలని సీఎం సూచించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**